


# పిచ్చాడు నవ్వేడు

డి. వెంకటరెడ్డి

శెలవు లింకా నెలరోజుల కిస్తా రననగానే చిన్నాన్న ఉత్తరం తర్వాత ఉత్తరం వ్రాసేస్తారు వాళ్ళ వూరికి రమ్మని ... యిదినాకు మామూలే. ఆ పల్లెటూరికి వెళ్ళాలంటే ఎందుకో నాకంతగా యిష్టం వుండదు. కాని వెళ్ళిన తర్వాత మాత్రం చిన్నమ్మ చెప్పే కబుర్లు వింటూ రోజులు గంటల లాగ గడిపేస్తాను. 'ఇండియాలో ఇన్స్యూరెన్సు కంపెనీలు పనిచేయటానికి చాలవరకు కారణం మన రైల్వే డిపార్టు మెంటు వాళ్ళే' అని కొంద రంటున్నప్పుడు ఆర్. టి. సి. వాళ్ళ గొప్పదనాన్ని గుర్తించటం లేదే అని బాధ పడుతూ వుంటాను నేను. యుద్ధరంగంలోవున్న సైనికుడికి ప్రాణాల మీద ఏమూలనయినా కాస్త ఆశ వుంటుందేమో గాని, ఆ బస్సులో కూర్చున్నంతసేపు నా బుర్ర మాత్రం మన సినిమాలలో చూపించే యమలోకం, స్వర్గలోకంసీనుల గురించే ఆలోచిస్తూ వుంటుంది. అయినా తప్పదు. చిన్నాన్నది ఒక చిన్నవూరు. పైన చెప్పిన రెండు గండాలు దాటి కాల్వ దాటి వుంత దారిలో పడితే అరగంట నడక.

పదిరోజులక్కడ గడిపినా 'అప్పుడే ఏం తొంద రొచ్చింది' అనే చిన్నమ్మను 'మరో రెండురోజులు పోయాక వెళ్ళొచ్చులేవోయ్' అనే చిన్నాన్నను వొప్పించి బేగ్ సర్దుకొని బయలుదేరేసరికి పది గంటలు దాటింది. ఆ కాల్వగట్టుమీద కనీసంరెండు మూడు గంటలయినా వెయిట్ చేస్తే, ఆ స్నంతా అయిపోయిన తర్వాత, ఆఖరిబస్సులో లాటరీ తగిలినట్టు దొరికితే టిక్కెట్టు దొరుకుతుంది ఆ బస్సులో. ఇంకో గమ్మత్తు కూడా వుంది. వచ్చేస్తే కావలసిన బస్సులు వరుసగా వచ్చేస్తాయి... లేక పోతే ఇకరావు.

ఆ కాల్వగట్టుమీద పెద్ద విగ్రగన్నేరుచెట్టు. దానికి కొంచెం దూరంలో రావిచెట్టు. ఆ విగ్ర గన్నేరు చెట్టుక్రింద ఒక పాక. అదే కాఫీహోటల్. అందులో ఒకటి రెండు బల్లలున్నాయి. పోయి ఒక బల్లమీద కూర్చున్నాను. ఏమీ తోచక బేగ్‌లో నుంచి వాత వీక్లీ తీసి చదవకుండా మిగిలి పోయినవి ఏమన్నా వున్నాయేమో చూస్తున్నాను.

అంతలో దగ్గరలోనే ఏదోనవ్వు వినిపించటంతో ప్రక్కకు తిరిగి చూశాను.ఎవరో పిచ్చోడు...నేను మరల పుస్తకం చదవటంలో మునిగిపోయాను. కాని యీ సారి కాల్వలో నుంచి ఏవో అరుపులు వినిపించటంతో అటు తలెత్తిచూశాను.

ఆ పిచ్చోడి చేతిలో ఏదో మూటవుంది. రాళ్ళు మూటకట్టిన ట్లనిపించింది. ఆ మూటను నీటిలో ముంచుతూ, పైకితీస్తూ "మునుగు...బాగా మునుగు ...పైకి కనిపిస్తే సంపుతాను ... సంపేస్తాను... మునుగు..." అని గట్టిగా అరుస్తూ ఒక్కసారి ఆ మూట నీటిలో ఒదిలేసి వొడ్డు మీదకు వచ్చేసి లోపల లోపల ఏదో గొణుక్కుంటూ కూర్చున్నాడు కొంతసేపు. తర్వాత ఎక్కడినుంచో పాతగుడ్డ నొకదానినితెచ్చి జాగ్రత్తగాపరచి ఆ చుట్టుపక్కల వున్న రాళ్ళను ఏరుకొని వొక్కొక్కటి తెచ్చి ఆ గుడ్డమీద ప్రోగుచేస్తున్నాడు.

ఆ రాళ్ళన్నీ మూటగట్టి ఏం చేస్తాడో నేను వూహించ గలిగాను. అయితే ఆ రాళ్ళ మూటలను నీటిలో ఎందుకు వాటిపెడుతున్నాడు? దీని వెనక ఏదో బలమయిన సంఘటన వుండి వుండాలి. ఆ సంఘటనే అతను పిచ్చివాడిగామారటానికి కారణం అయివుండాలి! ... అయితే ఆ సంఘటన ఎటు వంటి దయ్యుంటుంది?...ఊహించటానికి ప్రయత్నిస్తున్నాను.

ఏదో భయంకరమైన శబ్దం నా ఆలోచనలకు అంతరాయం కలిగించింది. ఒక్కసారి లేచి నిల బడి ప్రక్కకు చూశాను. బస్సువచ్చి ఆగింది. అది నరసాపురంవైపు పోయేబస్సు. ఆ పిచ్చోడు బస్సులోకిఎక్కిపోయి ఎవరినీ ఏమీ అడగకుండా చేయిముందుకు సాచుతున్నాడు. కొందరు తోచి నది యిచ్చారు. కొందరు ఎటోచూస్తున్నారు .మరి కొందరు అతనివైపు అసహ్యంగాచూసి అం ప్రక్కకు తిప్పుకొన్నారు. మాసిన గడ్డం చింపిరి జుత్తు నల్లగా ఎండిన మోడులా వుండి ఎముకలు పైకి కన్పిస్తున్నశరీరం,వికృతంగావున్న రూపాన్ని చూసి కెవ్వుమని అరిచిందో చంటిపాప.

'ఓయమ్మో! పాప జడుసుకొంటోంది. అవతలకి వెళ్ళు' కసిరిం దాపాప తల్లి పాపను వొళ్ళో దాచు కొంటూ. అంతవరకు టిక్కెట్ల హడావిడిలో వున్న కండక్టరు 'ఒరేయి నువ్వు లోపలికెందుకొచ్చావురా. దిగు. దిగమంటే నీక్కాదూ ... అంటూ రెక్కపుచ్చుకొని క్రిందకి దింపేశాడు. అతనికి యిది అలవాటే. పిచ్చోడు చేతిలో పైసల వైపు చూసుకుంటూ కండక్టరును ఏదో తిడుతు న్నాడు. బస్సు వెళ్ళిపోయింది.

తర్వాత పాకదగ్గరకు వచ్చి తన చేతిలోని పైసలు బల్లమీద పడేసి 'ఇడ్డెన్నియ్యి' అన్నాడు. బడ్డీ తాత లెక్కచూశాడు, ఏడు పైసలు...వాడి ముఖం లోకి ఒకసారి చూసి రెండు యిడ్డీలు ఆకులోవేసి అందించాడు. అవి తినేసి అక్కడ ఎవరో కాల్చి పారేసిన చుట్టపీక ఒకటి దొరికితే అది కాల్చు కుంటూ పోయి ప్రక్కనేవున్న రావిచెట్టు మొదట్లో కూర్చున్నాడు.

తెలుసుకొని ఏమీ చేయలేమని తెలిసినా ఒకో సారి ఎందుకో ఒక్కొక్కర్ని గురించి తెలుసుకోవా లన్పిస్తుంది. ఆ పిచ్చోడు గతజీవితమేమిటో?... ఆ బడ్డీతాత కేమయినా తెలుసునేమోయని అడి గాను.

'అదంతా పెద్ద గాథనాయనా! నీకు వినే వోపిక వుందా?' అన్నాడా తాత.

అతని గురించి తెలుసుకోవాలనే కుతూహలమే

గాకుండా నాకక్కడ ఏమీ తోచటంలేదు కూడాను. 'చెప్పుతాతా! వినాలని వుంది' అన్నాను.

కొన్ని నగ్న సత్యాలకు సంబంధించిన సాక్ష్యాలు మనకు దొరకక పోవచ్చు. పుకార్లుగా మన చెవిని సోకే వార్తలలో కూడా కొన్ని నిజాలుంటాయనేది నమ్మాలి. నిజాలను పుకార్లుగా మార్చగలిగే మహానుభావులు యీలోకంలో చాలా మంది వున్నారు. ఆ కన్పించే వూరు 'జగన్నాధగిరి' అక్కడ 'భుజంగరావు' అనే జమీందారొక డున్నాడు. ఆ పిచ్చోడి పేరు నీలయ్య. నీలయ్య తాతల కాలం నుంచి జమీందార్ల దివాణంలోనే బ్రతికే వాడు. వీడి వంశము కూటికి, కులానికి కొంచెము తక్కువదే అయినా, గుణానికి మాత్రం తక్కువది కాదు. వీడు చాలా ఆత్మాభిమానం గల మనిషి. తెచ్చుకొన్న కూలి డబ్బులతో గుట్టుగా కాపురం చేసేవాడు. ఎప్పుడూ ఎవర్నీ పన్నెత్తి మాట అనటం గాని పడటం గాని జరగలేదు. నీలయ్య పెళ్ళాం చంద్రమ్మ కూడ మొగుడికి తగ్గ పెళ్ళాం అనిపించుకొనెది. వాళ్ళ మాల గూడెంలో ఎవరికి ఎటువంటి కష్టము వచ్చినా అది తనకే వచ్చినట్లు బాధపడి చేతనయినంతగా సహాయపడే సున్నిత మనస్తత్వం నీలయ్యది.

'భుజంగరావు' గురించి వూళ్ళో ఎవరికున్న అభిప్రాయాలు వారికున్నాయి. కొందరికి దేవుడయితే మరికొందరికి దెయ్యంలాంటి వంటవాడు. కొన్ని సంసారాలను నిలబెట్టిన సహృదయుడయితే మరి కొన్ని సంసారాలను ధ్వంసంచేసిన దుర్మార్గుడు. కొందరికి ప్రాణదాత అయితే మరికొందరికి ప్రాణాలు తీసికొన్న కిరాతకుడు. 'పెదమనిషి.'గా చలామణీ కావటం ఎలాగో బాగా తెలిసినవాడు కావటంమూలంగా అయనను ఎక్కువమంది మంచి వాడిగానే చూస్తున్నారు. పూజిస్తారుకూడా. ఆయన దౌర్జన్యాలకు సంబంధించిననిజాలు పుకార్లరూపంలో ప్రజల చెవులలో పడితే వాటిని నమ్మలేని ఆరాధకులు కొందరుంటే వాటిని పుకార్లేఅంటారు. ఆయనంటే భయపడేవారు కొందరు.

ధనవంతులలోని దుర్వ్యసనాలను సమాజం అంతగా పట్టించుకోదు. అందుకు కారణాలు నేను చెప్పనవసరం లేదు. భుజంగరావుకు త్రాగుడు, వ్యభిచారంలాంటి వ్యసనాలున్నాయి ఆయన యింటి పట్టున అంతగావుండడు. ఊళ్ళోవున్నా 'రాజ్యలక్ష్మి' యింటి దగ్గరే ఎక్కువ సమయం గడుపుతాడు. రాజ్యలక్ష్మి గురించి ఎవరికి తోచినట్టు వారు చెప్పుకొన్నా, అసలు ఆమె గతజీవితం ఏమిటో, భుజంగరావు ఆమెను ఎక్కడనుంచి తీసుకువచ్చాడో, సరిగ్గా తెలిసినవాళ్ళు మాత్రం ఎవరూ లేరు.

భుజంగరావుకు 'తార్పుడు'గాడు, ముఖ్యంగా రాజ్యలక్ష్మికి కావలసిన సౌకర్యాలన్నీ చూసేవాడు, నమ్మినబంటు వొకడున్నాడు. వాడే అప్పన్న. అప్పన్న భుజంగరావుకు ఎడమ భుజమయితే లచ్చన్న ఆయనకు కుడిభుజం లాంటివాడు. అయన చేయించిన అన్యాయాలు, హత్యలు అన్నిటిలోనూ లచ్చన్నదే ముఖ్యపాత్ర అంటారు.

అప్పన్న కండలు తిరిగిన దండలు, ఎర్రని శరీరం, వంకీల జుత్తు ... ఆడవాళ్ళను యిట్టే ఆకర్షించుకోగల శక్తి వాడిలో వుంది. 'రాజ్యలక్ష్మి' భుజంగరావుతో రావటానికి కారణం ఆయనఆస్తి అంతస్తుఎంతయినా శీలం అమ్ముకునే స్త్రీల బుద్ధి సక్రమంగా ఎలా వుంటుంది? అప్పన్న కంటికి యింపుగా అనటం. అవకాశాలు అందుబాటులో వుండటం మూలంగా ఆమె అతనితో సంబంధం పెట్టుకొంది.

ఆవిషయం ఊళ్ళో వాళ్ళందరికీ తెలిసిన తర్వాతనే భుజంగరావుకు తెలిసింది, ఒకసారి ప్రత్యక్షంగానూ చూశాడు. అయినా ఆమెను ఏమీ అనలేదు. ఆమె ఆయనకు ప్రాణం, గుణం ఎటువంటిదో తెలిసినా ఆమెనువుంచుకున్నాడంటే, యిక్కడకు తీసుకువచ్చి పోషిస్తున్నాడంటే, ఆమెకు ఎంత బానిస అయిపోయాడో అర్థమవుతుంది. ఆమెను ఏమీ అనలేని అసమర్థుడు. అప్పన్నమీద పగబట్టాడు. అవకాశం చూస్తూ లచ్చన్నని సిద్ధంగా వుండమన్నాడు,

నీలయ్య పెళ్లాం చంద్రమ్మకుబిడ్డపుట్టిపోయాడు. ఆకాన్పులో ఆమెకు ధనుర్వాతం వచ్చింది. వారం రోజులపాటు తీసుకొన్న తర్వాత ఒకరోజు రాత్రి అది ముదిరి ప్రాణంమీదకు వచ్చింది. పట్నంలో ఎవరయినా పెద్దడాక్టరు దగ్గరకు తీసుకుపోకపోతే ప్రాణాలు నిలవటం చాలా కష్టమని చెప్పేశాడు ఊరివైద్యుడు, నీలయ్యకుఏమిచేయటానికి పాలుపోలేదు. ఈ అర్ధరాత్రివేళ పట్నానికి వెళ్ళడం ఎలాగ?...చేతిలో నయాపైస లేదు. చంద్రమ్మ పరిస్థితి చూస్తుంటే ఏమి చేయాలో అర్థం కాలేదు ఆ సమయంలో ఆదుకోగలిగే వారు భుజంగరావుగారే నని అయన ఇంటికి వెళ్ళి అక్కడ లేరనితెలిసి రాజ్యలక్ష్మి ఇంటికి వెళ్ళాడు. రెండు గంటల క్రిందటే ఆయన లచ్చన్నను వెంట బెట్టుకొని గొడ్ల చావిడి దగ్గరకు వెళ్ళారని తెలిసి అక్కడనుంచి చావిడిదగ్గరకు పరుగు తీశాడు. ఆ తొందరలో చావిడిలోనికి ప్రవేశించాడు నీలయ్య.

చావిడిలో భుజంగరావు చుట్ట కాలుస్తూ నిలబడ్డాడు. ప్రక్కనే లచ్చన్న నిలబడి వున్నాడు. వాళ్ళ కాళ్ళదగ్గర బస్తా మూట ఒకటుంది. నీలయ్యను చూడగానే వారిలో కొద్దిగా గాభరా కన్పించి వెంటనే మాయమయింది. వాళ్ళ ముఖాలలో ఏదో మార్పు కన్పించింది. నీలయ్యకు వాళ్ళవైపు చూడటానికి భయం వేసింది. తాను అక్కడకు ఎందుకు వచ్చాడో, ఏమి చెప్పాలో కూడా మరిచిపోయాడు. కొంచెం తేరుకొని ఏదో చెప్పాలని నోరువిప్పాడు నీలయ్య.

'నీలయ్యా! లచ్చన్నకు తోడుగా వెళ్ళు' అజ్ఞాపించి, ఒక్కసారి లచ్చన్నవైపు చూసి నీలయ్య చెప్పేదేమి వినకుండా వెళ్ళిపోయాడు భుజంగరావు. నీలయ్యకు ఏమిచేయాలో బోధపడలేదు. అసలు ఎక్కడవరకు వెళ్ళాలో, ఎందుకు వెళ్ళాలోకూడా అర్థం కాలేదు. జమీందారు మాటకు ఎదురుండదని తెలుసు. అందుకే అయోమయంగా చూశాడు లచ్చన్న మొహంలోకి. లచ్చన్న బస్తా భుజాన వేసుకొని 'యీ లాంతరు తీసుకొని ముందునడు కాలవకాడికి' అన్నాడు. తనకు తెలియకుండానే అతని చేతులు లాంతరు పట్టుకొన్నాయి, కాళ్ళు కాల్వవైపు దారితీసాయి. 'చంద్రికి ఎలావుందో! ... యీ పనేమిటో పూర్తిచేసేసి బాబుగారి దగ్గర కెళ్ళి ఆయన సాయమడిగి చంద్రిని పట్నంతీసుకుపోయి బతికించుకోవాలి' యీ ఆలోచనలతో తొందర తొందరగా నడుస్తున్నాడు నీలయ్య. అతను ఏదో ఆందోళనకు గురవుతున్నాడు ...

బిక్షతాత చెప్పుకుపోతున్నాడు. నేను ఆ దృశ్యాలను నా ఊహాలోకంలో చిత్రించుకొంటున్నాను.

కాల్వదగ్గరకు చేరారు. లచ్చన్న బస్తా క్రిందకు దింపి మూతి విప్పుతున్నాడు. నీలయ్య లాంతరు చూపిస్తున్నాడు. అంతే....ఆ దృశ్యంచూసి నీలయ్య ఒక్కసారి గట్టిగా అరిచాడు. అతని కళ్ళు తిరిగిపోతున్నాయి. వళ్ళు వణికిపోతుంది ... అప్పన్న శవం పీకకు తాడు బిగించబడివుంది. నాలుక, కళ్లు బయటకు వచ్చేశాయి. మొహమంతా నల్లబడిపోయింది, లచ్చన్న అరుపుతో యీ లోకంలోకి వచ్చాడు. 'ఎందుకలా అరుస్తావు, ఎవరుగోల చేసినా యీ రహస్యం ఏదన్నా బొక్కినా నీకూ యీగతే పడద్ది. తెల్సిందా'గర్జింపులావుంది లచ్చన్నగొంతు 'ఏం చేయమంటావు?' అన్నట్టు అసహాయంగా చూశాడు నీలయ్య. 'పోయి నీ నెత్తిమీద గుడ్డలోకి రాళ్ళేరుకొని మూటగట్టి పట్రా' అన్నాడు లచ్చన్న. నీలయ్య తనకు తెలియకుండానే నెత్తిమీద గుడ్డ

మన ఆనందమునకు పరమావధి పూర్ణారోగ్యము, నిరోగమయిన శరీరము ఆనంద నిలయము. వ్యాధిని ప్రేరేపించు శక్తులు అనంతము- వాటితో పోరాడి గెల్చుటకు

అంబేశ్వర ఆయుర్వేద ఫార్మసీ (రిజిష్టర్డు)

హెడ్డాఫీసు: మారుటేరు, ప.గో.జిల్లా, (ఆం.ప్ర)

వారి మందులు పూర్తిగా ఆధారపడదగినవి. వెంటనే వ్రాసి సుఖింపుడు.

బ్రాంచి ఆఫీసు: విజయవాడ, బీసెంటరోడ్, L.I.C. ఆఫీసు ఎదురుగా.

నేలమీద పరచి రాళ్లు అందులోకి వేస్తున్నారు.

'ఇంకా రావేరా!' తొందరగా నీళ్ళలో దిగిన లచ్చన్న గట్టిగా పిలిచాడు. పీలయ్య తొందరగా ఆ మూటపట్టుకొని నీళ్ళలో దిగాడు. లచ్చన్న ఆజ్ఞ ప్రకారం ఆ మూట శవం నడుముకి కట్టి మునుగు ... బాగా మునుగు ... పైకి కన్పిస్తే సంపుతాను సంపేత్తాను...' ఇంకా యేమిటో అంటుండే, ఆ శవాన్ని నీటి లోపలకు తోసేసి 'పదరా!' అన్నాడు లచ్చన్న. ఒడ్డుమీదకు వచ్చి లచ్చన్న బట్టలు పిండుకుంటున్నాడు, 'నా చంద్రి చచ్చిపోనాది...అది చచ్చి పోద్ది... నా పాపానికి అది చచ్చిపోద్ది... చచ్చిపోద్ది!"... ఏడుస్తున్నాడు పీలయ్య...అతని ప్రవర్తన లచ్చన్నకేమీ అర్థంకాలేదు. 'ఇంటికి పోదాం పదరా' అని లచ్చన్న చెప్పినా 'నా చంద్రి చచ్చిపోనాది... చచ్చిపోనాది..." అని గట్టిగా అరుస్తూ అక్కడనుంచి పరుగెత్తుకొని వెళ్ళి పోయాడు.

అలా యెక్కడికి పోయాడో యెవరికీ తెలియదు. చంద్రమ్మ ధనుర్వాతంతో చచ్చిపోయింది. దహనక్రియలన్నీ దగ్గరుండి జరిపించాడు భుజంగరావు. అసలు విషయమేమిటో తెలియని అమాయకపు ప్రజలు ఆయన ఉదార బుద్ధిని అమితంగా మెచ్చుకొన్నారు. అప్పన్న ఏమయి పోయాడో ఎవరికీ తెలియలేదు చాలా కాలంవరకు. లచ్చన్న భుజంగరావుతో గొడవపడి యీ విషయం పైకి చెప్పేనాటికి అప్పన్న గురించి అంతా మరిచి పోయారు.

కొన్నాళ్ళ తర్వాత పిచ్చి వాలకంతో వూరికి తిరిగి వచ్చాడు పీలయ్య. తన గుడిసెదగ్గరకు వెళ్ళి 'చంద్రీ ... చంద్రీ! ... అని పిలిచాడు. జనమంతా మూగి వింతగా చూశారు వాడివైపు 'చంద్రమ్మ చచ్చి పోనాది' అందులో ఎవరో అన్నారు. 'అవును మర్చిపోయాను...యీడకొచ్చే నేటి...'అంటూ శ్మశానంవైపు వెళ్ళిపోయాడు పీలయ్య. భుజంగరావు ఇంటికివెళ్ళి గొడవ చెయ్య బోయాడు కాని వాళ్ళ అల్సేషన్ కుక్క చేతిమీద వేసిన మచ్చ అస్తమానం కంటికి కన్పించటం మూలంగా ఆ ఇంటివైపు వెళ్ళేవాడు కాదు. ఎప్పుడయినా భుజంగరావు కారుకు అడ్డం పడితే ఏమయినా డబ్బులు వాడి చేతిలో పడేసి పోతూ వుంటాడు.

ఆ కాల్వ దగ్గరకు వచ్చి రాళ్ళు మూటలు గట్టి దానిలో పడేస్తూ ఏవో అరుస్తూ వుంటాడోసారి. 'చచ్చిపోనాది ... నా చంద్రి చచ్చిపోనాది ... నా పాపం దాన్ని సంపేసింది' అని ఏడుస్తూ,వళ్ళంతా రక్కేసుకొని జుట్టంతా పీకేసుకొంటుంటాడొకోసారి. ఒకోసారి పిచ్చిగా నవ్వుతుంటాడు. ఒకో సారి శ్మశానంలోకిపోయి అక్కడక్కడే తిరుగుతూ వుంటాడు. ఎప్పుడూ ఒకేలావుండడు. ఒకోసారి ఎవరైనా, ఏదైనా బస్తా మోసుకొని వెళ్తుండే గట్టిగా అరచి దూరంగాపారిపోతూ వుంటాడు.'ఆ సంచిలో అప్పన్నున్నాడు...అడ్డి నీటిలో ముంచేత్తారు." అంటూ వుంటాడు.

తాత మాటలు శ్రద్ధగా వింటున్న నేను చిన్న కారు హారను విన్పించటంతో ప్రక్కకు తిరిగి చూశాను.పీలయ్య ఆ కారుకు అడ్డంగా నిలబడ్డాడు. డ్రైవరు కారు ఆపుచేశాడు.

'ఆయనే భుజంగరావు' గుసగుస లాడుతున్నట్టు అన్నాడు తాత.

'లచ్చన్న ఒత్తా తెత్తాన్నాడా! ... రాళ్ళేరిని నాను. మీరెల్లిపోండి ...' ఇంకా ఏవో అంటు న్నాడు పీలయ్య. భుజంగరావు ఒక రూపాయినోటు తీసి వాడి చేతిలో పెట్టి డ్రైవరు వైపు చూశాడు. డ్రైవరు కారు పోనిచ్చాడు.

పీలయ్య ఆ రూపాయినోటు చూసి 'ఇదా నా చంద్రి... ఒరేయి నా చంద్రి ఏదిరా... ఏయుద్దా ... పోతున్నావు...' అంటూ రాయి తీసి కారును వేసి కొట్టాడు. డ్రైవరు కారు ఆపి కారుకు తగిలిన చోట్ల చూసి, లంజకొడుకును పట్టుకోండ్రా!" అన్నాడు. పీలయ్య పరుగెట్టుకొని పెద్ద రోడ్డుమీద పడిపోయి లేచి కాల్వలో దూకేశాడు. భుజంగరావు కారు వెళ్ళిపోయింది.

ఈలోపున నేను వెళ్లాల్సిన బస్సు రావడంతో ఎక్కేశాను. పీలయ్య కాల్వలో మునుగుతూ లేస్తూ ఏవో అరుస్తున్నాడు. రోడ్డుమీద పడినప్పుడు నుదుటిమీద దెబ్బ తగిలిందనుకొంటాను. కొద్దిగా రక్తం కారుతోంది. నేను వాడివైపుచూసి ఒక్క నిట్టూర్పు విడిచాను. పిచ్చోడు నవ్వుతున్నాడు, వెకిలిగా. బస్సు బయలుదేరింది భారంగా.

★

## ఇదీ భారతం

మణిపూర్‌కు ప్రత్యేక రాష్ట్రప్రతిపత్తి కావాలని 150 మంది వాలంటీర్లు 7 రోజుల పాటు రిలే నిరాహారదీక్ష జరిపారు.

* * *

దొంగమార్కుల జాబితాను సమర్పించారనే కారణంతో పాట్నా వైద్యకళాశాలలో ఐదుగురు విద్యార్థులకు ప్రిమెడిసిన్ తరగతిలో ప్రవేశం నిరాకరించబడింది.

* * *

పూనా రైల్వేస్టేషన్‌లో ఒకయువతిని రైలుపెట్టెలో మానభంగం చేసిన ఐదుగురు సైనికోద్యోగులను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు.

* * *

రిజర్వుబ్యాంకులో దొంగనోట్ల చెలామణీ పెచ్చుపెరిగి పోతున్నదట. 1966-67 సంవత్సరంలో ఈ బ్యాంకుకు చేరిన దొంగ నోట్ల సంఖ్య 4497 కాగా ఆ సంఖ్య 1967-68 కి 6000 లకు పురోభివృద్ధి సాధించిందట,

* * *

రాజభరణాల రద్దు తన శవంమీదుగానే అమలు జరగాల్సి వుంటుందని బనాసకాంత పార్లమెంటరీ నియోజకవర్గం ఎన్నిక సమయంలో శ్రీ ఎస్. కె. పాటిల్ చేసిన భీషణ ప్రతిజ్ఞను నిలబెట్టుకొనవలసినదిగా మధ్యప్రదేశ్‌లోని సంస్థానాధీశుల ఇండ్ల కొలువులో వున్న ఉద్యోగులు శ్రీమాన్ ఎస్. కె. పాటిల్‌కు విజ్ఞప్తిచేశారు.

* * *

శ్రీమాన్ చెంచురామానాయుడు ఆంధ్రప్రదేశ్ అటవీశాఖా మాత్యపదవిని నిర్వహించే సమయంలో "ప్రజల ఆస్తిని తన స్వంతఆస్తిగా పరిగణించి" రిజర్వుఫారెస్టును జాగీర్దార్‌కు కట్టబెట్టడానికి చేసిన ప్రయత్నాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు డివిజన్‌బెంచి విమర్శించింది.



రైల్వే స్టేషన్ వద్ద,
రామాలయంవీధి